నామవరం దాటుతున్నప్పుడు రోడ్డు పక్క ఓ పెద్ద యాక్సిడెంటు దృశ్యం కనిపించింది. అంతకు కొన్ని నిమిషాల కిందే జరిగినట్టుంది. టూవీలర్, కారు ఢీకొట్టుకున్నాయి. ఇద్దరు యువకులు రక్తమోడుతూ ఉండగా, స్ట్రెచర్ మీద పడుకోబెట్టి అంబులెన్సు ఎక్కిస్తున్నారు. ప్రమాదదృశ్యం బీభత్సంగా కనిపిస్తున్నది. నేను కారును కాస్త పక్కకు తీసి, ఆపబోయాను.

''పోనివ్వండి.. పోనివ్వండి! దైవదర్శనానికి వెళ్తున్నప్పుడు ఇలాంటివి పట్టించుకోకూడదు. ఎవడికి ఎక్కడ రాసి ఉంటే అక్కడ అయిపోతుంది. అంతే!'' అన్నాడు.

''అయినా.. దేవుడు రాసిన రాతను కూడా వీళ్లు ముందే చెరిపేసుకుంటున్నారు. లేకపోతే ఎందుకొచ్చిన బైకులు, ఎందుకొచ్చిన దిక్కుమాలిన స్పీడ్లు.. ఒళ్లు తెలియకుండా బైకు నడుపుతారు. చివరికి ఇలా రోడ్డు మీద మిగులుతారు..'' అన్నాడు.

నేను కారు ఆపలేదు. ఆ దృశ్యం ఇంకా కళ్లలో కదులుతూనే ఉంది. ఆ యువకులు ఇద్దరి చుట్టూనే నా ఆలోచనలు ముసురుకుంటున్నాయి.


ఆనందరావు ఆ యాక్సిడెంటు గురించే ఏవో పాప కర్మలను ప్రస్తావిస్తూ మాట్లాడుతున్నాడు. అవి చెవుల లోపలికి వెళ్లటడం లేదు. అతని గమ్యస్థానం అన్నవరం వచ్చేసింది. మెట్ల దారి దగ్గర కారు ఆపాను. అతను దిగిపోతూ..

''ఉదయ్.. మీలాంటి యువకులు మన ధర్మాన్ని కాపాడాలి. మా సంస్థ చేస్తున్న కార్యక్రమాలకు తోడ్పడాలి. మీకు తోచిన విరాళం ఇచ్చి ప్రోత్సహించండి..'' అని ఒక చందా పుస్తకం నాముందు పెట్టాడు.

''ట్రావెల్ చార్జీని చందాగా ఉంచుకోండి'' అనేసి.. అతనికి 'బై!' చెప్పి బయల్దేరాను.

* * *





పెట్రోల్ ఖర్చు కలిసొస్తుందనీ, మనిషి తోడూ ఉంటుందని ఊరికి వస్తున్నప్పుడు, తిరిగి వెళ్తున్నప్పుడూ నా కారులో ప్రయాణికులను ఎక్కించుకుంటాను. నా తోటి వయసు వారైతే సినిమాలు, క్రికెట్టు, టూరిస్టు ప్రదేశాలు, ఉద్యోగాలూ, ప్యాకేజీల గురించి మాట్లాడతారు. మధ్య వయస్కులు రాజకీయాల గురించి మాట్లాడతారు. ఎవరేం మాట్లాడినా.. వాళ్ల ఇష్టాయిష్టాలే స్పష్టంగా తెలుస్తాయి. నేను సహజంగా వాళ్లతో ఏకీభవించడమో, వ్యతిరేకించడమో చేయను. చెబుతూ ఉంటే వింటాను. కొన్ని విషయాలైనా కొత్తగా తెలుస్తాయి. అలా తెలుసుకోవడం మనసుకు బాగుంటుంది. బ్లాబ్లా యాప్ వచ్చాక దానిలో మన ప్రయాణం తేదీ, సమయం, చార్జీలతో నమోదైతే చాలు.. అదే మార్గంలో వెళ్లే ప్రయాణికులు యాప్ ద్వారా మనల్ని కాంటాక్ట్ అవుతారు. మనం ఓకే చేస్తే మన కోసం వేచిచూస్తూ ఉంటారు. వైజాగ్ నుంచి అన్నవరం వరకూ సాగిన ఆనందరావు ప్రయాణం అలాంటిదే! అతని నుంచి విన్న మాటలు మాత్రం చాలా కొత్తగా ఉన్నాయి. కానీ, ఆవు అనుకొని ఎద్దు దగ్గర ఆగినవాడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మనుషుల దగ్గర ఆగకపోవడం మాత్రం.. నా మనసుకు సబబుగా అనిపించడం లేదు.

అతను చెప్పిన ఇతర విషయాల గురించి తీరిగ్గా ఆలోచించాలి. చదవడమో, ఫ్రెండ్స్‌తో చర్చించడమో చేయాలి. వీలైతే రెండూ చేయాలి.

కత్తిపూడి దాటిం తర్వాత ఫోను మోగింది.

''హలో!'' అన్నాను.

''నేను రవిబాబును. ప్రత్తిపాడుకు ఎంత దూరంలో ఉన్నారు?'' అడిగాడాయన.

''చాలా దగ్గర్లో ఉన్నానండి. పది నిమిషాల్లో అక్కడ ఉంటాను. మీరు హైవేలో ఉన్నారు కదా?'' అన్నాను.

ఎక్కడ ఉన్నాడో ల్యాండ్‌మార్క్‌తో సహా చెప్పాడు.

ఈరోజు ప్రయాణంలో రవిబాబు నా రెండో ప్యాసింజర్. ప్రత్తిపాడు నుంచి విజయవాడ దాకా వస్తాడు. రాజమండ్రి లాలా చెరువులో మరో ఇద్దరు ఎక్కుతారు. లాక్‌డౌన్ పరిస్థితులు పాక్షికంగానైనా కొనసాగుతున్నందున చాలామంది తక్కువమందితో షేర్ ట్రావెలింగ్ చేయడానికి ఇష్టపడుతున్నారు. అతను చెప్పినట్టు సిగ్నల్ లైట్ దాటిన తరువాత బస్‌షెల్టర్ దగ్గర కారు ఆపాను. అతను డోర్ తీస్తూ చనువుగా పలకరించాడు.

''కచ్చితంగా పది నిమిషాల్లోనే వచ్చేశారే..'' అన్నాడు.. ఓ చిన్న పుస్తకాల కట్టను లోపల పెడుతూ.

సీట్లో కుదురుకొని కూర్చున్నాక..

''దారంతా వర్షమే ఉందా?'' అన్నాడు.

''లేదు.. తుంపరలాగ పడుతూ ఉంది'' చెప్పాను.

''ఇక్కడ పొద్దున పెద్ద వర్షం పడింది. వరిరైతులకు చాలా నష్టం. పొట్ట మీద ఉన్న చేను నీట్లో నానిందంటే రైతు కష్టమంతా పోయినట్టే!'' అంటూ నిట్టూర్చాడు.

నా చూపు ఆ పుస్తకాలపై పడటం గమనించి..

''చే గువేరా పేరు విన్నారా? ఆయన గురించిన పుస్తకం ఇది. 53 ఏళ్ల క్రితం ఇదేరోజు చనిపోయాడు. ఈరోజు ప్రపంచవ్యాప్తంగా 39 దేశాల్లో వివిధ భాషల్లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి సభలు జరుపుతున్నారు'' అని చెప్పాడు.

నాక్కూడా 'చే' బొమ్మ ఉన్న ఒక టీషర్టు ఉంది. అదే చెప్పాను. నవ్వాడు.

''చే గురించి ఏమన్నా చదివారా?'' అనడిగాడు.

''లాటిన్ దేశాల్లో ఫ్యాషన్ ఐకాన్ కదా?'' అన్నాను.

తను మళ్లీ నవ్వాడు.

''తనొక రివల్యూషనరిస్టు. ఆయన త్యాగాన్ని మరుగున పడేసి, తెగువను బిజినెస్ సింబల్‌గా మార్చేశారు''.

''ఎవరు?''.

''ఇంకెవరు? బిజినెస్ చేసేవాళ్లు''.

... అలా సాగుతూ ఉంది మా సంభాషణ.

అతను చెబుతున్నవి కూడా కొత్త విషయాలే!

* * *

జగ్గంపేటకు ముందు టోల్‌గేట్ వచ్చింది.

''సార్.. స్వీట్‌కార్న్.. వేడివేడి స్వీట్‌కార్న్!'' ఓ పదే